## మెనూ ప్రకారం
# అల్పాహారం ఇవ్వాలి



విద్యార్థులతో అల్పాహారం తింటున్న డీఈవో రేణుకాదేవి

మోమిన్‌పేట, నవంబర్ 16 : విద్యార్థులకు సోమవారం నుంచి శనివారం వరకూ మెనూ ప్రకారం సీఎం అల్పాహారం అందించాలని డీఈవో రేణుకాదేవి అన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎన్నికైన చంద్రాయన్‌పల్లి పాఠశాలలో సీఎం అల్పాహారం ప్రారంభించి విద్యార్థులతో కలిసి తిన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతిరోజూ ఉదయం 8:45 గంటలకు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన అల్పాహారం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## వాహనాల తనిఖీల్లో
# నగదు పట్టివేత




నగదును సీజ్ చేసి మీడియాకు చూపుతున్న ఎస్ఐ అరవింద్

యాలాల్, నవంబర్ 16: అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో పోలీసులు విస్తృత తనిఖీలను చేస్తున్నారు. గురువారం చేపట్టిన తనిఖీల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేయగా, తాండూరు నుంచి కర్నూలు వెళ్తున్న ఓ ట్రక్కును అడ్డుకొని తనిఖీ చేశారు. ట్రక్కులో తరలిస్తున్న రూ.8 లక్షల 40 వేలను స్వాధీనం చేసుకున్నారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో ఎస్ఐ అరవింద్ వాటిని సీజ్ చేశారు.

# బీఆర్‌ఎస్‌కు నీరాజనం

**బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డికి అన్ని వర్గాల సంపూర్ణ మద్దతు**
**జోరుగా బీఆర్‌ఎస్‌లో చేరికలు**
**కాంగ్రెస్ ప్రచారానికి మద్దతు కరువు**



బీఆర్‌ఎస్ ప్రచారానికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు (ఫైల్)

తాండూరు, నవంబర్ 16 : తాండూరు నియోజకవర్గంలోని సబ్బండ వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉంటూ రోహిత్‌రెడ్డిని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేస్తున్నారు. గడిచిన తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతో నియోజకవర్గ ప్రజలు బీఆర్‌ఎస్ వైపే మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి స్వచ్ఛందంగా చేరుతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పి.రోహిత్‌రెడ్డి గెలుపునకు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు 13 రోజులే గడువు ఉండడంతో అన్నీ పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాయి. ప్రత్యేక ప్రణాళికతో ప్రచారం చేపట్టిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారు. ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా వందలాది మంది ప్రజలు రోహిత్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్నారు. మహిళలు హారతులిస్తూ.. యువకులు ఉత్సాహాన్ని వ్యక్తం చేస్తూ.. బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్‌పార్టీలోని నాయకులు తమ మనుగడ కోసం పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆ పార్టీ క్యాడరే విమర్శిస్తున్నది. పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు పెట్టగల వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ గాలం వేసి పట్టుకుందని, ప్రజాసేవ చేసే వారికంటే డబ్బులు ఖర్చు పెట్టే వారికే టికెట్లు అమ్ముకుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న బీఆర్‌ఎస్ ప్రజాక్షేత్రంలో నిరంతరం ఉంటూ తాండూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డికే బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించి బీఫాం ఇవ్వడంతో ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక మెజార్టీతో తాండూరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డిని గెలిపించుకుంటామని ముక్తకంఠంతో ముందుకెళ్తున్నారు.

**అద్భుతంగా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో...**

బీఆర్‌ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎకరానికి రూ.16వేల రైతు బంధు, సౌభాగ్యలక్ష్మి పేరుతో పేద మహిళలకు రూ.3000 భృతి, రూ.400లకే వంటగ్యాస్, ప్రతి కుటుంబానికి రూ.5లక్షల బీమా సౌకర్యం, కేసీఆర్ ఆరోగ్యరక్ష ద్వారా వైద్య చికిత్సలకు రూ.15 లక్షలు, రేషన్‌పై సన్నబియ్యం, అర్హులైన వారికి రూ.5016 ఆసరా పెన్షన్లు, అగ్రవర్ణ పేదలకు గురుకులాలు, స్వశక్తి మహిళా గ్రూపులకు భవనాలతో పాటు పలు పథకాలను ప్రకటించడంతో కుల సంఘాల ప్రతినిధులు రోహిత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. నీ వెంటే మేము...మీ గెలుపు మా భరోసా అంటూ హామీ ఇస్తున్నారు. స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లోకి చేరుతున్నారు. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలో తెలంగాణను నంబర్-1 రాష్ట్రంగా మార్చిన బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి పోయే వారు కేవలం డబ్బులకు అమ్ముడు పోయినవారేనని స్థానిక నేతలు, ప్రజలు పేర్కొంటున్నారు.



కాంగ్రెస్ ప్రచారంలో కనిపించని జనం (ఫైల్)

**ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా**



తాండూరులో జరిగిన అభివృద్ధికి ఆకర్షితులై.. భవిష్యత్‌లో తాండూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేపట్టడంతో నియోజకవర్గం ప్రజలు, వివిధ కుల, మత సంఘాలు బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలపడం చాలా సంతోషంగా ఉంది. బీఆర్‌ఎస్‌లోకి స్వచ్ఛందంగా చేరడం అభినందనీయం. తాండూరులో చేపట్టిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని 'కారు' గుర్తుకు ఓటు వేసి మళ్లీ నన్ను గెలిపిస్తే తాండూరు నియోజకవర్గాన్ని అన్నివిధాలా మరింత అభివృద్ధి చేస్తా. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలకు కనిపిస్తున్న కాంగ్రెస్ నేతల మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దు. ప్రతి నిత్యం ప్రజలతోనే ఉంటూ ప్రజా సంక్షేమం, తాండూరు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న తనను ప్రజలందరూ ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

**- రోహిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి తాండూరు**



తాండూరు, నవంబర్ 16 : తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బాబాయ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పంజుగుల శ్రీశైల్‌రెడ్డి కూతురు నవ్య వివాహం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు తాండూరు నియోజకవర్గంలోని బంధుమిత్రులు, బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సేంద్రియ సాగును ప్రోత్సహించాలి



వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 16 : దేశవ్యాప్తంగా సేంద్రియ సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పీజేటీఎస్ఏయూ మాజీ వీసీ ప్రవీణ్‌రావు అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ఆవరణలో గల ఆడిటోరియంలో రెండో రోజు జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విత్తనం నాణ్యతతో పాటు , సాగు భూమిలో సేంద్రియ ఎరువులు, ఎలాంటి పొల్యూషన్ లేని వాతావరణంలో సేంద్రియ పద్ధతులలో సాగు చేసే పంటల శాతం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే అందుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు అవసరమన్నారు.

# నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్**



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, (మాడ్గుల) నవంబర్ 16: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్వపు మాడ్గుల మండల పరిధిలోని ఇర్విన్, గిరికొత్తపల్లి, రామదుగ్యాల గ్రామాలలో ఇంటింటా ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమానికి ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్ విచ్చేసి స్థానిక నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దయతో ఇర్విన్ గ్రామాన్ని మండలం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల అనంతరం ఇర్విన్‌లో 60 రకాల అన్ని మండల కార్యాలయాలు ఏర్పాటు చేసి స్వంత భవనాన్ని నిర్మిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇర్విన్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా త్వరలో ఏర్పాటు చేస్తానని ఆయన చెప్పారు. దేశంలోని బీజేపీ , కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాయా అని ఎద్దేవా చేశారు. ఇర్విన్ గ్రామానికి బీటీ రోడ్డు, సీసీ రోడ్లు నిర్మించానని ఆయన తెలిపారు. ఇర్విన్, గిరికొత్తపల్లి, రామదుగ్యాల గ్రామాల్లోని దళితులందరికీ విడతల వారీగా దళితబంధు, ఇల్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మీ పథకం ద్వారా రూ. 3 లక్షలు అందజేస్తానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి రాజకీయ జన్మనిచ్చిన సీఎం కేసీఆర్‌కు ద్రోహం చేసి కాంగ్రెస్‌లోకి వెళ్లాడన్నారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి లేకే బీఆర్‌ఎస్ నాయకుడిని తీసుకొని ఎమ్మెల్యేగా నిలబెట్టారని ఎద్దేవా చేశారు. అనంతరం మాడ్గుల మాజీ జడ్పీటీసీ సభ్యుడు పగడాల రవితేజ అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న రవితేజను పరామర్శించారు. అంతకు ముందే ఇర్విన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీ వెంకటయ్య, తిరుపతమ్మ, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు లాలయ్యగౌడ్, కృష్ణారెడ్డి, జార్జిరెడ్డి, చలమంద గౌడ్, జంగయ్య, ఆర్‌కే గౌడ్, శ్రీనివాస్, దేవ రాజ్‌నాయక్, శివగౌడ్, రాములుయాదవ్, హరికృష్ణ పాల్గొన్నారు.